క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పుల్లలచెరువు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్

పుల్లలచెరువు: పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. ఇటీవల వరకు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. అందులో భాగంగా ఆమె ఈ-క్రాప్ నమోదును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని పెద్ద పీఆర్సీ తండాలో పర్యటించి పంట నమోదును తనిఖీ చేశారు. ఆమె రైతులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఏ పంట ఎక్కువగా వేశారని, పంటలు ఎలా ఉన్నాయని, వారి వివరాలు తెలుసుకుంటూ ప్రతి రైతు తాను సాగు చేసిన పంటను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. దీంతో అనేక ప్రయోజనాలు రైతులు పొందవచ్చన్నారు. అనుకోని సంఘటనలు జరిగి, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి సాయం అందజేసేందుకు వీలుంటుందని చెప్పారు. ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు తప్పని సరిగా చేసుకోవాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి, వీఏఏ అనితాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందుకుంటున్న రోగులు

దర్శి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాత ఎన్వీ సుబ్బారెడ్డి సహకారంతో కుష్టి వ్యాధిగ్రస్తులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుష్టి వ్యాధిగ్రస్తులకు మందులు, సబ్బులు, చెప్పులు అందజేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సృజన, చందలూరు పీహెచ్‌సీ వైద్యురాలు బ్లెస్సీ, మానవత దర్శి శాఖ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, సెక్రటరీ అడపాల గణేష్, కోశాధికారి గొర్రెపాటి వేణు, వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, బీవీ రెడ్డి, పి.రాజశేఖరరెడ్డి, ఆర్.మోషే, సుశీలమ్మ, వెంకటరావు, డాక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు ఎంపీడీఓగా సుందరరామయ్య



సుందరరామయ్య (ఫైల్)

తాళ్లూరు (దర్శి): తాళ్లూరు ఎంపీడీఓగా కల్లూరి సుందరరామయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాళ్లూరులో ఈఓఆర్డీగా పని చేస్తున్న సుందరరామయ్య ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొండా యుగకీర్తి గుంటూరుకు బదిలీపై వెళ్లారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దర్శి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్ కరపత్రాలు ఆవిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి మోగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు హాజరవుతారన్నారు. మాదిగ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గోళ్లపాటి మార్కు, రాచపూడి మోషే, గర్నెపూడి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల సచివాలయాన్ని స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. ఇంటి పన్ను, నీటిపన్ను, ట్రేడ్ లైసెన్సులపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే అర్జీలపై సత్వరమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. అన్నాక్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

అన్నదాతకు రిక్తహస్తం



వరినాట్లు వేస్తున్న కూలీలు



పొగనాట్లు వేస్తున్న కూలీలు

- పంటకాలం సగం పూర్తయినా అందని సాయం
- రైతు భరోసా పేరు మార్పుపైనే పాలకుల శ్రద్ధ
- ఎన్నికల హామీలకు కూటమి నేతల తూట్లు

కురిచేడు:

అన్నదాతలను అడ్డంగా మోసం చేయడంలో కూటమి ప్రభుత్వం సఫలమైంది. వ్యవసాయాన్ని చిన్నచూపు చూసే చంద్రబాబు ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అందని ద్రాక్ష పండులా మార్చేశారు. గత ప్రభుత్వంలో ఖరీఫ్‌కు ముందే రైతులకు సాయం అందేది. అంతేకాకుండా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించేవారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇంత వరకు రైతులకు అందాల్సిన సాయం అందించకపోగా ఆ ఊసే ఎత్తక పోవడం రైతుల నడ్డి విరిచినట్లయింది. ఒక వైపు సాయం అందక.. మరో వైపు పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు. ఇప్పటి వరకు వరుణుడు, భానుడు దోబూచులాడుతూ రైతుల జీవితాలతో ఆటలాడుతున్నారు. అప్పుడప్పుడూ కురిసిన వర్షాలకు రైతులు పంటలను సాగు చేయడం, వెంటనే భానుడి ప్రకోపానికి అవి తట్టుకోలేక చనిపోతుండటంతో రైతులు రెండు మూడు సార్లు పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టుబడులు పెరిగి అప్పులపాలవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలివిడత సాయంగా రెండు వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇస్తానన్న పెట్టుబడి సాయం ఊసే ఎత్తక పోవడంతో రైతులు ప్రభుత్వ సాయం అందించ లేదని, ఈ సారి కూడా ఘోరంగా మోసం చేసిందనే నిర్ధారణకు ఇప్పటికే వచ్చారు. మే నెలలో రైతు భరోసా నగదు రూ.5,500 ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అదికాస్తా ఆగిపోయింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం రైతులు అప్పులు చేయాల్సి వచ్చింది.

రైతుకు నష్టం..దళారీలకు లాభం

రాష్ట్రంలో రాయలసీమలో టమోట పంట పండించిన రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర లేక ఉత్పత్తులను రోడ్ల వెంట పడేస్తున్నారు. మార్కెట్లో టమోట ధర కిలో 80 రూపాయల వరకు ఎగబాకింది. రైతుల వద్ద గిట్టుబాటు ధరకు కొనుగోలుకు వెనకాడుతున్న దళారీలు మార్కెట్లో మాత్రం ఇబ్బడి ముబ్బడిగా ధరలు పెంచుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయడం లేదు. బయట మార్కెట్లో అధిక ధరలకు వ్యాపారులు విక్రయిస్తున్నా ప్రభుత్వం సాయం చేయడం లేదు. కనీసం అధిక ధరలను అదుపు చేసే ప్రయత్నం కూడా చేయడం లేదు. దళారులకు కూటమి ప్రభుత్వం మద్దతు పలుకుతున్నట్లు నిర్ధారణ అవుతుందని రైతులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేకపోయినా కేవలం పొలంబాట ద్వారా అధికారులను పొలం పంపించి రైతులకు ఎంతో మేలు చేస్తున్నట్లు నటిస్తోందని రైతులు వాపోతున్నారు.

అందిన చోటల్లా అప్పులు చేస్తున్నా:



ఈ ఏడాది రైతు భరోసా ద్వారా పంట సాయం అందక పోవడంతో అందినకాడల్లా అప్పులు చేసి పంట సాగు చేస్తున్నా. ఎండలకు సాగు చేసిన పంట నిలువునా ఎండిపోతుంది. ఎన్ని సార్లు సాగు చేసినా పంటలు ఎండిపోతున్నాయి. బయట మార్కెట్లో విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందుల ధరలు మండిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే సాయం అందించి రైతులను ఆదుకోవాలి.

పెద్దిశెట్టి శ్రీనివాసులు, కురిచేడు

పెట్టుబడి లేక వ్యవసాయం మానుకున్నా:



వాతావరణం పరిస్థితులు బాగాలేవు. ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. వ్యవసాయం చేయకుండా మానేసి కూలి పనులకు వెళ్తున్నా. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంది. ఈ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు.

పి.ఆంజనేయులు, కురిచేడు

కందిలో సస్యరక్షణతో అధిక దిగుబడి



పూత దశకు వచ్చిన కంది పంట

పుల్లలచెరువు: పప్పు దినుసుల్లో కందికి మంచి డిమాండ్ ఉంది. సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దాదాపు 6,500 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడంతో సకాలంలో వర్షాలు రావడంతో ప్రస్తుతం పూత దశకు చేరుకుంది. కొన్ని స్వల్పకాలికి రకాల్లో కాపు ప్రారంభమైంది. ఈ దశలో పురుగు తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సస్యరక్షణ చేపట్టకపోతే తొలిదశలో వచ్చే పూత మొత్తం పురుగుల బారిన పడి రాలిపోతుంది. తర్వాత వచ్చే పూత ద్వారా మాత్రమే దిగుబడి అవుతుందని వ్యవసాయాధికారి తెలిపారు. రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.

రెండు ధపాలుగా మందు స్ప్రే

కంది పంటలో పూత ప్రారంభానికి ముందు, పూత వచ్చిన తర్వాత విధిగా క్రిమి సంహారక మందులు పిచికారీ చేసుకోవాలి. పూత, కాపు దశలో గులాబీ రంగు పురుగు తీవ్రంగా నష్టపరుస్తుంది. దాన్ని నివారించేందుకు లీటర్ నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె, 2 మిల్లీలీటర్ల ప్రొపెనోపాస్, 2 మిల్లీలీటర్ల క్లోరిపైరీపాస్ కలిపి పిచికారీ చేయాలి. ఈ మందులతో ఇతర పురుగుల నివారణ కూడా చేయవచ్చు. అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలి.

వేప నూనెతో మంచి ఫలితాలు:

కంది పంటలో సూచించిన రసాయన మందులతో పాటు విధిగా వేప నూనెను పిచికారీ చేసుకోవాలి. దీని ద్వారా ఆకులను తినే పురుగుల నియంత్రణలోకి వస్తాయి. మరో వైపు పురుగుల గుడ్లు కూడా నాశనం అవుతాయి. కంది సాగులో కీలకమైన ప్రస్తుత దశలో రెండు దఫాలుగా మందుల పిచికారీ చేస్తే ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు.

నిర్మలాదేవి, వ్యవసాయాధికారి, పుల్లలచెరువు

కొచ్చెర్లకోట ఎస్సీ రైతుల ఆందోళన



జేసీబీని అడ్డుకుంటున్న ఎస్సీ రైతులు

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీకి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1.10 కోట్లతో వాటర్ షెడ్ మంజూరైంది. గ్రామానికి చెందిన వారు రూ.20 లక్షలకు వాగుల్లో పనులు చేశారు. మిగిలిన పనులు చేద్దామనుకునే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో గ్రామస్తులు పూర్తిగా పనులు నిలిపేశారు. ప్రభుత్వం మారిన తర్వాత కూటమి నాయకులు రంగంలోకి దిగారు. ఇది తమ ప్రభుత్వమని, తమ ఇష్టం వచ్చిన దగ్గర పని చేసుకుంటాం.. అంటూ పనులు ప్రారంభించారు. కొచ్చెర్లకోట ఎస్సీలకు 45 ఏళ్ల కిందట ఇందిరా గాంధీ ప్రభుత్వంలో సర్వే నంబర్ 532లో 130 ఎకరాల భూమి మంజూరు చేశారు. నాటి నుంచి నేటి వరకు పొలం సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వాటర్ షెడ్ పనులు ఎస్సీలకు చెందిన పొలాల్లో అధికారులు, రాజకీయ నాయకులు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. దీన్ని ఎస్సీ రైతులు అడ్డుకున్నారు. ఇది తమ పొలమని, తమకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, మీ పొలాల్లో పనులు చేసుకోవాలని ఆందోళనకు దిగారు. కొంతమంది ఎస్సీ రైతులు గురువారం పొలాల వద్దకు వెళ్లి జేసీబీని అడ్డుకున్నారు. ఈ విషయం వాటర్‌షెడ్ పీఓ శేఖర్‌ను వివరణ కోరగా రైతుల పొలాల్లో పనులు చేసేందుకు వీల్లేదన్నారు. ప్రభుత్వ భూముల్లో మాత్రమే పనులు చేయిస్తామని చెప్పారు. తహసీల్దార్‌ను కలిసి సర్వేయర్‌తో ప్రభుత్వ భూమి సర్వే చేయించుకుని అందులో మాత్రమే పనులు చేయిస్తామని చెప్పారు.

ఈ-పంట నమోదుపై సోషల్ ఆడిట్



పంట నమోదు జాబితాను పరిశీలిస్తున్న రైతులు

దొనకొండ: ఈ ఏడాది ఖరీఫ్ పంట కాలంలో మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు చేసిన రైతుల వివరాలను సామాజిక తనిఖీ కోసం ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు రైతు సేవా కేంద్రంలో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. రైతుల పంట నమోదును రైతు వాట్సప్ గ్రూప్‌లో కూడా పెట్టాలని సిబ్బందికి సూచించారు. పంట మోదు జాబితాను గురువారం పెదన్నపాలెం రైతు సేవా కేంద్రంలో పంటల జాబితా ప్రదర్శించారు. 5,297 మంది రైతులు 15,569 ఎకరాల్లో పంటలు సాగు చేశారని, పత్తి, కంది, పొగాకు, మిర్చి, ఆముదం పంటలను సాగు చేసినట్లు గుర్తించారు. 18వ తేదీ తుది జాబితా తయారవుతుందని, దాన్ని కూడా రైతు సేవా కేంద్రాల్లో ఉంచుతామన్నారు. రైతులకు వారి మొబైల్ ఫోన్‌కు మెసేజ్ పంపిస్తామని ఏఓ వెల్లడించారు.

75 మందికి వైద్య పరీక్షలు

కురిచేడు: మండలంలోని నాంచారపురంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించి 75 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి పి.ప్రవీణ్ తెలిపారు. గ్రామంలో జ్వరపీడితుల కోసం సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎటువంటి జ్వరపీడితులు లేరని తెలిపారు. గ్రామంలో అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వైద్యశిబిరంలో మరో వైద్యాధికారి రవితేజ, సీహెచ్‌ఓ కృపమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మాణిక్యం, ఏఎన్ఎంలు వి.పద్మావతి, ఆశాలు బి.సుకన్య, సీహెచ్ రేణుక, కేవీ రమణ, కె.రమేష్, సర్పంచ్ కావేరి, పంచాయతీ కార్యదర్శి మధుబాబు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



పుల్లలచెరువు: శ్రీకనక దుర్గాదేవిగా అమ్మవారు



పెద్దదోర్నాల: ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



పెద్దారవీడు: అంకాళమ్మ అమ్మవారు



దర్శి: దుర్గాదేవిగా కనకదుర్గమ్మ తల్లి



దర్శి: దుర్గాదేవిగా దద్దాలమ్మ అమ్మవారు



దర్శి: వనదుర్గా దేవిగా పోలేరమ్మ అమ్మవారు



తాళ్లూరు: గుంటి గంగా భవానీ అమ్మవారు



ముండ్లమూరు: మహా కాళికాదేవిగా భ్రమరాంబిక



వై.పాలెం: మహిషాసుర మర్దినిగా అమ్మవారు

దర్శి: నియోజకవర్గంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూలమాలలతో అమ్మవారి అలంకరణ అందరినీ ఆకర్షించింది. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. పట్టణంలోని దద్దాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు వనదుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కనకదుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ తల్లి దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గుంటి గంగా భవాని అమ్మవారు శ్రీకనకదుర్గా దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని అందంగాపూల మాలలతో అలంకరించారు. ముండ్లమూరు మండలం మారెళ్ల శ్రీ భ్రమరాంబికా దేవి మాతా సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ భ్రమరాంబికాదేవి అమ్మవారు శ్రీమహాకాళీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు చేశారు. ఆయా ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండ: దేవీ శరన్నవ రాత్రుల మహోత్సవం సందర్భంగా ఆనంద ఆశ్రమంలో గురువారం ఈశ్వరీదేవి కనకదుర్గమ్మగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, భజనలు చేసి ధూప దీప నైవేద్యం సమర్పించి హారతులిచ్చారు. పురోహితులు మణిబాబు శర్మ అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పెదన్నపాలెం గ్రామానికి చెంది పోశం కొండారెడ్డి, అంజలి దంపతులు భక్తులకు అల్పాహారం అందజేశారు. శుక్రవారం ఈశ్వరీదేవి మహిషాసురమర్దినిగా దర్శనమిస్తుందని భైరవానంద స్వామి తెలిపారు.

పెద్దారవీడు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో కొలువైన రాజ్యలక్ష్మి అమ్మవారు గురువారం గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, సామూహిక సహస్ర కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాధాలు స్వీకరించారు.

పెద్దదోర్నాల: మానవులకు సకల విద్యల్ని ప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి అయిన అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మూల నక్షత్రం సందర్భంగా పలు దేవాలయాల్లో సామూహిక అక్షరభ్యాసాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని జ్ఞానాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని పలు దేవాలయాలు విద్యుద్దీపాలతో కాంతులీనుతున్నాయి. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవీ మాత అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు బి.రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్ర నామపారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పుల్లలచెరువు: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా ఆలయాల్లో పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు శ్రీ కనకదుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు విరివిగా పాల్గొని సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు గురువారం శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిలు భక్తులకు శ్రీ దుర్గాభవానిగా దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు భక్తులచే ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



దర్శి: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పూజల్లో భక్తులు



దొనకొండ: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

యర్రగొండపాలెం: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రెంటచింతల శ్రీరామచంద్రమూర్తి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం కూష్మాండ హారతి ఇచ్చారు. సాయంత్రం మహిళా భక్తులతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు సూరె వెంకట ప్రసాద్, గుర్రం కృష్ణమూర్తి, కోశాధికారి గ్రంధి రమణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్రిపురాంతకం: శన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ప్రత్యేక పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు.